సీరియల్-

విహారికోయిల

[illegible]

(గత సంచిక తరువాయి)

"అవి చీడా అనే ఒకరకమైన కీటకాలు చేస్తున్న రొద. అవి గుంపుగా ఓచోటునుంచి మరోచోటికి వెళ్తుంటాయి. అవి మనిషి శరీరంమీద వాలితే చాలు శరీరంలో రకరకాల మార్పులు వస్తాయి. ముందుగా అది వాలినచోట విపరీతంగా వాచిపోవటం, పొడలు పొడలుగా బొబ్బలు లేవటం జరుగుతుంది.

అదిగాని కుడితే నోటి నుంచి, ముక్కు నుంచి రక్తస్రావం జరుగుతుంది. ఒకటికన్న ఎక్కువ కుడితే శరీరంలోని రక్తం విరిగిపోయి, క్షణాల్లో ప్రాణం పోతుంది." ఆ మాట చెప్తున్నప్పుడు కోయిల గొంతు కొద్దిగా వణికింది.

"అయితే ఎలా వాటి నుంచి తప్పించుకోవటం?" అడిగాడు సిద్ధార్థ.

ఝుమ్మన్న శబ్దం మరింత సమీపంగా వినిపిస్తోంది. అంటే ప్రమాదానికి చాలా చేరువలో వున్నారన్నమాట తాము.

"దానికి పోకచెట్లే విరుగుడు" అంటూ ఒంటెమీది నుంచి ఛెంగున కిందికి దూకింది కోయిల. "నువ్వుకూడా దిగు. ఈ చెట్ల బెరడు నోట్లో వుంచుకుని పోకలా నములుడమే ఈ చీడా కాట్లనుంచి మనల్ని రక్షిస్తూంది" అంటూ బాణంలో పోకచెట్ల బెరడు తీసి కొంత తను నోట్లో వేసుకొని, మరో ముక్క సిద్ధార్థ కందించింది.

ఇద్దరు బెరడు నమిలి రసాన్ని మింగేలోపల వారి కతిసమీపంలో వలయాకారంగా చక్కర్లు కొడుతూ వేగంగా దూసుకొస్తూన్న చీడాదండు కనిపించింది.

"ఇప్పుడు వాటి కాటుకూడా మనల్ని బాధించదు" అని కోయిల చెప్పూండగానే చీడాలు వాళ్ళిద్దరి శరీరాల మీద వాలటం జరిగిపోయింది. అయితే వాళ్ళ దగ్గర నుంచి పోకచెట్లు బెరడు వాసన రావటం గుర్తించగానే వచ్చినంత వేగంగానూ మళ్ళీ గాల్లోకి లేచి క్షణాల్లో మాయమయ్యాయి.

సిద్ధార్థకి చాలా అద్భుతంగా అనిపించింది.

"సమయానికి మనమీ పోకచెట్ల దగ్గరకు చేరుకుని వున్నాం కాబట్టి సరిపోయింది. లేకుంటే వాటి కాట్లకి బలైపోయేవాళ్ళమే కదూ....!?" అన్నాడు.

"అవును. నిస్సందేహంగా. అవి మనల్ని కుట్టివుంటే ఈపాటికే రక్తస్రావంతో ప్రాణాలు వదిలిపెట్టే వాళ్ళం. మనం తిన్నగా వెళ్ళేదారిలో అఘాతం ఏర్పడి వుండకపోతే పోకచెట్లు మనకి దొరికేవి కావు. ఇప్పుడిక అవి వేరేదారిలో యెదురైనా వాటినుంచి ప్రమాదం లేదు. బెరడు బుగ్గన అలాగే ఉండనివ్వు" అన్నది కోయిల ఒంటె నధిరోహిస్తూ.

సిద్ధార్థకూడా ఒంటెపై కెక్కాడు.

మళ్ళీ ప్రయాణం కొనసాగింది. అతనికి వేసటగా వుంది. వేదనగా వుంది. మూడు రోజులుగా నిద్ర లేదు. సరైన ఆహారం లేదు. దాంతో శరీరావయవాలు సహకరించటం లేదు.

నోరంతా చేదుగా జ్వరం వచ్చినప్పుడుండేలా అరుచిగా వుంది పోకచెట్టు బెరడు నోట పెట్టుకోవటం వల్లనేమో ననుకున్నాడు కాని, అది కారణం కాదు. బహుశా తనకి ఎడారి వాతావరణం అలవాటులేక శరీరం తట్టుకోలేక పోతోంది. అందుకే ఏదో మార్పు వచ్చింది.

కాని తన పరిస్థితి నతడు కోయిలతో చెప్పలేదు. ఆమె ఇప్పటికన్నోసార్లు తనని మృత్యు ముఖం నించి కాపాడింది. ఆమె ప్రతిన చెల్లించుకోవటానికి తన చేతనైన సాయం చెయ్యాలి. అప్పుడు ఎడారి నుంచి బయటపడటానికి ఆమె సాయం తీసుకోవచ్చు. తెల్లారేవరకు ఓపిక పట్టాలి.

ఆలోచనల్నుంచి బయటపడ్డాడు సిద్ధార్థ. తన ఒంటె నడకలో ఏదో స్పష్టమైన మార్పు వచ్చింది. ఏమిటది?

ఒంటె కుడికాలు ఎత్తి ఎత్తి వేస్తోంది. ఏదో విపరీతమైన బాధతో అది తలను అటు ఇటూ వేగంగా ఊగిస్తోంది.

దాని కుడికాలువైపు చూశాడు సిద్ధార్థ. కాలికి ఏదో తాడులా చుట్టుకొనివుంది. అయితే అది తాడుకాదని భయంకరమైన విషసర్పమని, అది ఒంటె కాలి నప్పటికన్నోసార్లు కరిచిందని, ఒంటె రక్తం పూర్తిగా విషపూరితమైపోయిందనీ అతను గ్రహించేసరికి ఒంటె నోటి నుంచి నురగలు వస్తున్నాయి.

అమాంతం ఒంటె ఇసకలో కూలబడిపోవటం, విష సర్పం తల అతి వేగంగా సిద్ధార్థ కాలివైపు దూసుకు రావటం ఒకేసారి జరిగాయి.

సిద్ధార్థ ప్రమాదాన్ని గుర్తించిన మరుక్షణం చేతనున్న కత్తితో దాని తల ఒక్క వేటుకు నరికేశాడు.

కోయిల ఒంటెమీదినుంచి చెంగున కిందికి గెంతి అతన్ని సమీపించింది.

"సమయానికి మెరుపుకన్న వేగంగా కత్తి నడిపించావ్. చాలా ప్రమాదం తప్పిపోయింది నీకు. కాని ఒంటె బలైపోయింది" అన్నది విచారంగా కోయిల.

అప్పటికే ఒంటె అవయవాలు నిస్తేజమైపోయాయి.

"ఎడారుల్లో మాత్రమే తిరిగే ఈ సర్పాలు మామూలు విష సర్పాలకన్న వందరెట్లు విషపూరితమైనవి. విశేషమేమిటంటే దీని కోరల్లోనే కాదు, శరీరం ప్రతి అణువునా విషముంటుంది. అందుకే ఒంటెవంటి మహాకాయం కూడా దీని కాటుకి నేలకూలిపోయింది." చెప్పింది కోయిల.

"అయితే ఇప్పుడెలా?"

"ఇద్దరం నా ఒంటెమీదనే ప్రయాణం సాగించాలి." అన్నది కోయిల.

* * *

ఇద్దరు ఒకే ఒంటె నధిరోహించారు. ముందు కోయిల, ఆమె వెనక సిద్ధార్థ.

ఆమె శరీరంలోని అనాచ్ఛాదితమైన భాగాలు అతని శరీరానికి తగులుతున్నాయి. ఆమెను అనుకొని అంత సమీపంగా కూచోవటం అతనికి ఇబ్బందిగా, సిగ్గుగా వుంది.

కాని కోయిల అదేమీ గమనించే స్థితిలో లేదు. ఆమె

ఏకైక లక్ష్యం ఘోర్క్ జాతిని సమూలంగా నాశనం చెయ్యటం. అంతే! తక్కిన విషయాలేవీ ఆమె మనసును స్పృశించటం లేదు.

సిద్ధార్థ వాచీ చూసుకున్నాడు.

రెండు గంటల పదినిమిషాలు. వాతావరణం మరీ చల్లగా వుంది. చలేస్తోంది. ఉండీ వుండీ గాలి చేస్తూన్న వింత ధ్వని సన్నగా పైకి లేస్తూన్న ఇసక చేస్తున్న శబ్దం తప్పితే అంతటా ప్రశాంతంగా వుంది.

“ఇప్పుడు మనం కుడికి తిరగాలి. మనకి ఆఘాతం అడ్డొచ్చిన దారికి మళ్ళుతున్నాం. నా అంచనా ప్రకారం మరో గంట, గంటన్నరలో గమ్యం చేరుకోగలుగుతాం” చెప్పింది కోయిల

“మీకు వాచీలు, గడియారాలు వుండవు కదా! గంటలు ఎలా లెక్కిస్తారు?”

“పగలైతే సూర్యుడి గమనాన్నిబట్టి రాత్రిళ్ళు ఝాముల్నిబట్టి లెక్కిస్తాం. మా పెద్ద వాళ్ళకి ఇవన్నీ లెక్కకట్టడం బాగా తెలుసు.”

సిద్ధార్థ మౌనంగా వింటున్నాడు.

వారికి సమీపంలో సన్నటి వెలుతురు మినుకు మినుకు మంటూ కనిపిస్తోంది.

సిద్ధార్థ ఆ వెలుతురు చూపించి, “అదేనా ఘోర్క్ జాతి నివసించే ప్రదేశం?” అనడిగాడు.

కోయిల తేరిపార అటు చూసి, “ఉహూఁ! అది మాలాంటి మనుషులే నివసించే మరో గూడెం. ఈ ఎడారి ప్రాంతంలో దాదాపు ఇరవై ఎనిమిది గూడేలున్నాయని మా వాళ్ళు చెప్తుంటారు.” అన్నది.

అయితే కోయిల అంచనా ఇక్కడే ఘోరంగా

తప్పింది. అంతక్రితమే వెళ్ళవలసిన దారి తప్పింది. అలవాటులేని దారిలో అంతదాకా సాగిన ప్రయాణం వల్ల, సహజంగానే ఆమె పొరబడింది.

అది తమ గూడేల్లాంటి గూడెం కాదని, తన పెద్ద వాళ్ళకూడా తెలియని అతి అనాగరికమైన జాతి మనుషులుండే నరక కూపమని, అక్కడ తాము ఘోరమైన పరిణామాన్ని ఎదుర్కోవలసి వస్తుందని ఆమె గ్రహించలేదు.

సరిగ్గా వాళ్ళు ఆ వెలుగును సమీపిస్తుండగానే ఎక్కడినుంచో గాల్లో రివ్వు రివ్వున దూసుకొచ్చాయి బాణాలు.

ప్రమాదం గ్రహించగానే కోయిల సిద్ధారతో పాటు కిందికి గెంతేసింది. బాణాలు వాళ్ళ తలలమీదుగా అతి వేగంగా దూసుకుపోయి ఇసకలో కూరుకుపోయాయి.

ఆమె ఇలాంటి పరిస్థితి నెదుర్కోవటానికి సిద్ధంగా లేదు. అయినా క్షణాల్లో ఎలర్టుగా అయిపోయింది.

"ఎవరో మనమీద తెలియక బాణాలు వదులుతున్నారు. నువ్వూ బాణాలు వదులు." అంటూనే నారి ఝుంకారం చేస్తూండగా తమవైపు బాణాలు వచ్చిన దిశలో వున్న గుబురుగా పెరిగిన చెట్టువైపు శరపరంపర వదిలింది.

పెద్దగా కేక పెడుతూ ఇద్దరు నేలమీద పడిపోయారు. వాళ్ళ శరీరాల్లో గుచ్చుకున్న బాణాల కొసలు స్పష్టంగా కనిపించాయి సిద్ధారకి.

అయితే ఆ చెట్టుమీద ఇంకా మనుషులున్నారనిటానికి సూచనగా మళ్ళీ బాణాలు దూసుకొచ్చాయి వాళ్ళవైపు.

అయితే ఈసారి రెండో ఒంటె శరాఘాతాలకి బలై పోయింది. దాని శరీరంనిండా బాణాలు గుచ్చుకున్నాయి.

చెదిరిపోయి తన ఇష్టమైన దిశలో గెంతులు వేస్తూ వారిపోయింది ఒంటె.

కోయిల ఆగ్రహాన్ని అణచుకుంటూ బాణాలు గుప్పించింది. సిద్దార్థ కూడా ఆమెకు తీసిపోకుండా వదుల్తున్నాడు బాణాలు.

మరో ఇద్దరు చెట్టుమీదినుంచి పక్షుల్లా నేలకూలిపోయారు. అయితే నేల కూల్తూ వాళ్ళు చేసిన సంకేతం గాలిలో ప్రతిధ్వనించి ఎక్కడో వున్న వాళ్ళ మనుషులకి వార్త చేరిపోయింది.

బాణాలవర్షం తాత్కాలికంగా ఆగిపోయింది.

"మనం వెంటనే ఇక్కడ్నుంచి తప్పించుకుపోవాలి. వీళ్ళు మా గూడెం మనుషులకి భిన్నంగా వున్నారు. వీళ్ళు మనమీద శత్రుత్వంతో వ్యవహరించారు. తమ మనుషుల్ని చంపినందుకు ఆ గూడెం వాసులు మనమీద ప్రతీకారం తీర్చుకుంటారు. పరుగెత్తు" అంటూ ఇసకలో పరుగందుకున్నది కోయిల.

ఆమెతోబాటు పరుగెత్తుతూ, "ఇలా ఎంతదూరం పరుగెత్తిపోగలం? మనం తలదాచుకోవటానికి మరుగైన ప్రదేశం ఏదీ కనుచూపు మేరలో కనిపించటంలేదే....!" అన్నాడు సిద్దార్థ.

"అదిగో ఆ చెట్టు చూశావా? చాలా దట్టమైన కొమ్మలు. ప్రస్తుతానికి మనకి అదే రక్షణ నిస్తుంది." అన్నది కోయిల.

పది నిమిషాల్లో ఆ చెట్టు సమీపించారు.

కోయిల చకచక ఎక్కేసింది చెట్టు.

కాని సిద్దార్థ నాలుగైదు సార్లు జారిపోతూ మళ్ళీ ప్రయత్నిస్తూ చివరికి కోయిల చేయి అందించగా ఎలాగో

చెట్టెక్కాడు.

ఇద్దరు గుబురు కొమ్మల్లోకి ఎగబాకి కూచోవటానికి అనుకూలంగా వున్న ఓ కొమ్మమీద కూచున్నారు.

వాళ్ళకిప్పుడు చాలా దూరంవరకు కనిపిస్తోంది ఆ ప్రాంతమంతా. దూరంగా వెలుగు కనిపించింది. ఆ వెలుగు క్రమంగా కదులుతూ వస్తోంది.

• • •

సిద్ధార్థ కళ్ళు చికిలించి చూశాడు.

అనుమానంలేదు. ఇందాకా ఆ మనుషులు నేల కూలి పోతూ పెట్టిన కేకలకి జవాబుగా వాళ్ళ మనుషులు పరుగెత్తుకొస్తున్నారు. క్షణాల్లో తమ ప్రాకారంలోకి శత్రువులెవరో ప్రవేశించినట్టు గ్రహిస్తారు. ఆ తర్వాత తమ కోసం వేట ప్రారంభమవుతుంది.

కోయిల మనసు నలిగిపోతోంది. తాననుకున్నదేమిటి, జరిగిందేమిటి? మరో గంటలో ఘోర్క్ జాతి బందిపోట్ల ప్రాకారం చేరుకోగలనని, వాళ్ళని సమూలంగా నాశనం చెయ్యగలననీ ఎంతగానో అనుకొన్నది. తన ప్రతీకారం చెల్లించుకోవాలని ఆరాటపడింది.

కాని అనుకోకుండా ఎదురైన అవాంతరంవల్ల తనపని అసంపూర్తిగా మిగిలిపోయింది. వీళ్ళ చేతుల్లో చిక్కితే తమని ప్రాణాలతో వొదలరు, అది నిశ్చయం! తనుకూడా ప్రాణం పోయేవరకు ఎదిరించి పోరాడి వీలైనంతమందిని హతమార్చగలదు. కాని, ఏం సాధించినట్టు? తను హత మార్చవలసింది వీళ్ళని కాదు.

దీర్ఘంగా నిట్టూర్చింది కోయిల.

ఆ వెలుతురు కాగడాల వెలుతురని గ్రహించారిద్దరు. జంతు కొవ్వునుంచి చమురుతీసి దాని సాయంతో

కాగడాలు తయారు చేస్తారు ఎడారి వాసులు.

"వాళ్ళు ఇటే వస్తున్నారు. బాణాలు ప్రయోగించి నేలకూల్చుదామా?" అన్నాడు సిద్ధార. అతని మాటల్లో ఆత్మవిశ్వాసం, కోటి మందిని ఒకేసారి నేలకూల్చగల నన్న ధైర్యం ధ్వనించాయా మెక.

"అది చాలా ప్రమాదం. వాళ్ళు దాదాపు ఏభైమంది వున్నారు. అదిగో కాగడాల వెలుతురులో ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నారు, గమనించావా?"

సిద్ధార అవునన్నట్టు తలూపాడు.

"మనం ఇద్దరం, మన దగ్గిర బాణాలు కూడా ఖర్చయి పోయాయి. వాళ్ళ కెదురునిలిచి బతికి బయటపడలేం. తప్పనిసరి పరిస్థితి యెదురైతే ఇక అదే దారి!" అన్నది కోయిల.

తమ మనుషులు నేలకూలిన చెట్టును చేరుకున్నారు ఆ ఏభైమంది వ్యక్తులు.

వాళ్ళ ఒంటిమీద గోచీలుతప్ప మరేవిధమైన అచ్ఛాదనా లేదు. వాళ్ళు నల్లగా లావుగా పొట్టిగా వున్నారు. మరుగుజ్జులా అనిపించేలా వాళ్ళందరి చేతుల్లోను విల్లంబులున్నాయి. వాళ్ళ కళ్ళు రక్తంతో తడిసినట్టు ఎర్రగా మెరుస్తున్నాయి కాగడాల వెలుతురులో.

వాళ్ళు దయ, జాలి అనే మాటలకర్థం తెలియని కర్కశులని వాళ్ళ రూపమే చెపుతోంది.

తమ మనుషులు చచ్చిపడుంటం చూడగానే వాళ్ళలో వీరావేశం పెల్లుబికింది. గట్టిగా దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ఆ భాషేమిటో వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు.

కోయిల జాతివాళ్ళు యాసతోనైనా అర్థమయ్యే

పిండీలోనే మాట్లాడారు. వాళ్ళ వేషభాషలు మరీ ఆనాగరికమైనవి కాదు. కాని అదే ఎడారిలో మరో మూల ప్రాంతంలో నివసిస్తున్న ఆ మరుగుజ్జు మనుషుల వేషభాషల్లో ఎంత విపరీతమైన మార్పు?

వాళ్ళు నలువైపులా నాలుగు భాగాలుగా చీలి పోయారు. తమ శత్రువులకోసం వేట ప్రారంభించారు.

సిద్ధార్థ, కోయిల ఇక తమ అంతిమ క్షణాలు సమీపించాయని అర్థం చేసుకున్నారు. ప్రాణాలు పోయే ముందు వీలైనన్ని ప్రాణాల్ని బలితీసుకోవాలి. అదే వాళ్ళ స్థిర నిర్ణయం!

వాళ్ళు కాగడాల సాయంతో ఆ ప్రదేశమంతా క్షుణ్ణంగా ప్రతీ అంగుళం వెతుకుతున్నారు.

వాళ్ళలో ఓ బేచ్ వెతుక్కుంటూ తిన్నగా కోయిల సిద్ధార్థలు కూర్చున్న చెట్టుకిందికి వచ్చారు.

కోయిల సిద్ధార్థ కళ్ళతోనే ఒకరికొకరు సంకేతాలనందించుకున్నారు. ఊపిరి బిగబట్టి కూర్చున్నారు కొమ్మ మీద. అప్పుడో మరుక్షణంలోనో వాళ్ళు తమని చూడటం ఖాయం!

ఇద్దరు బాణాలు చేతపట్టుకున్నారు.... విల్లు ఎడమచేత, బాణం కుడిచేత సిద్ధంగా వున్నాయి. సిద్ధార్థ భుజమ్మీది గాయం నుంచి అంతకితమే రక్తం మళ్ళీ స్రవించటం మొదలయ్యింది. అయినా పళ్ళబిగువున బాధను అణచుకుంటూ అలాగే కూచున్నాడు. పట్టాకత్తి కొమ్మమీద అనువుగా పెట్టుకున్నాడు.

మరుగుజ్జు వాళ్ళలో తెలివితేటలు అధికంగా వుంటాయనటానికి నిదర్శనంగా అందులో ఒకడు ఇసకలో చెట్టుకిందపడ్డ తమ కాలి గుర్తుల్ని పసికట్టేశాడు. తన

వాళ్ళతో ఉద్రేకంగా ఏదో చెప్పాడు.

అంతే! అందరి దృష్టి చెట్టుమీదకి తిరిగింది. వాళ్ళు సరిగా పన్నెండుమంది వున్నారు. బాణాలు ప్రయోగించినా బలంగా నాటుకోనంత దగ్గరగా వున్నారు.

వాళ్ళు కాగడాలు పైకెత్తిపట్టుకున్నారు. చెట్టు కొమ్మలు చాలా గుబురుగా వున్నాయి. పైన ఎవరైనా దాక్కుని వున్నదీ లేనిదీ కనిపించటంలేదు. అయితే పైనుంచి సిద్ధార కోయిల వాళ్ళని స్పష్టంగా చూడగలుగుతున్నారు వెలుగులో వుండటంవల్ల. ఏ క్షణంలోనైనా అగ్నిపర్వతం బద్దలవుతుందని వాళ్ళు గ్రహించారు.

వాళ్ళలో వాళ్ళేదో గోలగా మాట్లాడుకుంటున్నారు. ఒకేసారి నలుగురు చెట్టెక్కటం మొదలెట్టారు.

సిద్ధార కోయిలల గుండెలు గొంతులో కొట్టుకుంటున్నాయి. ఇక సమయం ఆసన్నమయింది.

సిద్ధార పట్టాకత్తి చేత్తో అందుకున్నాడు. చెట్టెక్కిన వాడినల్లా దాంతో తెగనరికెయ్యటానికి నిర్ణయించుకున్నాడు.

వాళ్ళు నలుగురు చకచక చెట్టెక్కి పైకి వచ్చేశారు. సిద్ధార, కోయిల వాళ్ళ దృష్టిలో పడిపోయారు. వాళ్ళు ఆనందంతోను ఆవేశంతోను పెద్దగా కేకలు పెట్టారు.

అంతే! కింద నించున్న వాళ్ళలో చైతన్యం వచ్చింది. గోలగా అరిచారు.

సిద్ధార చేతిలోని పట్టాకత్తి విసురుగా లేచింది. అదే సమయంలో కోయిల పైకొమ్మలకెక్కి అక్కడ్నుంచి బాణాలు సంధించింది.

చకచక నలుగుర్ని నేలకూల్చేశారు సిద్ధార, కోయిల. కింద పెద్ద కోలాహలం!

సరిగ్గా అప్పుడే ఒక్కసారిగా పదుల సంఖ్యలో చుర్చు మృగాలు అక్కడ ప్రత్యక్షమయ్యాయి. కింద నిల్చున్న ఎనిమిదిమంది మరుగుజ్జుల్ని క్షణాల్లో విష వాయువు వదిలి హతమార్చేశాయి.

అంతటితో అవి శాంతించలేదు. ఎడారి నలువైపులా కాగడాలతో తిరుగుతున్న తక్కిన మరుగుజ్జుల మీద దాడి చేశాయి. ఒక్కడిని కూడా వదిలిపెట్టకుండా అందర్నీ వెంటాడి వేటాడాయి.

వాటి ముక్కులనుంచి వెలువడుతున్న విషవాయువు ఘాటు సిద్ధార్థ, కోయిలల నాసికా పుటాలని సోకాయి. వెంటనే శ్వాసను బంధించారు ఇద్దరూ.

కొద్ది క్షణాల తర్వాత చుర్చు మృగాలు తమ విశ్వ రూపాన్ని ఉపసంహరించుకుని శాంతించాయి. వచ్చినవి వచ్చినట్టే ఎటో మాయమయ్యాయి.

కోయిల, సిద్ధార్థ అప్పుడు ఊపిరి వదిలారు. ముక్కుకి ఘాటు వాసనలు తాకలేదు. గుండెనిండా స్వచ్ఛమైన గాలిని పీల్చుకున్నారు.

ఘోర ప్రమాదాన్ని వెంట్రుకవాసిలో తప్పించుకో గలిగినందుకు ఒకరినొకరు అభినందించుకున్నారు.

అప్పుడు సమయం తెల్లవారుఝామున నాలుగు గంటలయింది.

కోయిల ముఖంలో నిరాశను స్పష్టంగా గుర్తించాడు సిద్ధార్థ.

"ఉత్సాహం తెచ్చుకో! ఎలాగైనా ఆ ఘోరక్ర జాతి నంతం చేసి తీరతాం. నీ తండ్రి ఆత్మకు శాంతి చేకూర్చుతాం." అన్నాడు సిద్ధార్థ ఆమెను ప్రోత్స హిస్తూ.

కోయిల కళ్ళు మెరిశాయి. ముఖంలో మళ్ళీ కళా కాంతులు చోటు చేసుకున్నాయి.

"నిజంగా మనం ప్రతీకారం చెల్లించుకోగల మంటావా?" అన్నది.

"ఖచ్చితంగా. ఈ రోజు కాకున్నా రేపయినా సాధిస్తాం.... ఇక వెళ్దామా?"

"వెళ్దాం. మనం దారి తప్పామని ఇప్పుడర్థమయ్యింది నాకు. తెల్లవారితే నే గాని ఈ పరిసరాల్ని గుర్తించలేను. ఈ ప్రాంతాని కిదివరలో ఎప్పుడూ వచ్చిన గుర్తూ లేదు."

"అయితే తెల్లారేవరకు ఈ చెట్టుమీద ఇలాగే గడిపేద్దామా?"

"అది ప్రమాదం. ఆ మరుగుజ్జు జాతివాళ్ళింకా చాలా మంది వుండొచ్చు. ఈ ఏభైమంది తిరిగి రాకపోవటం చూసి వాళ్ళు బయల్దేరి రావచ్చు."

"అందు కవకాశముంది. అయితే మనం వెంటనే ఈ ప్రాంతం వదిలి వెళ్ళిపోవటమే శ్రేయస్కరం. మనమీది పగను ఈ మరుగుజ్జుల మీద చూపి, మనల్ని రక్షించిన చుర్యాలు వీళ్ళకన్న ఎంతో నయం! వాటికి మన కృతజ్ఞతలు తెలియ చేసుకుందాం."

కిలకిల నవ్వింది కోయిల.

"గమ్మత్తుగా మాట్లాడతావు" అన్నది.

ఇద్దరూ చెట్టు దిగారు.

• • •

మరో గంటసేపు గమ్యంలేని ప్రయాణంలా అలా ముందుకు సాగిపోయారిద్దరూ.

తూర్పున తొలి తెలిరేకలు విచ్చుకునే సమయం. చలి గాలి రివ్వున ముఖానికి ఈడ్చికొడుతోంది.

ఇద్దరు ఇసకలో కాలినడకన నడుస్తున్నారు. కోయిల సునాయాసంగా సాగిపోతుంటే, కూరుకుపోతున్న కాళ్ళను కూడదీసుకుంటూ బాగా వెనబడిపోయాడు సిద్ధార.

వాళ్ళ భుజాలకు ధనుస్సులు వేలాడుతున్నాయి. చాలా తక్కువ బాణాలు మాత్రం వీపుకు కట్టుకున్న అంబులపొదలో వున్నాయి. పట్టాకత్తిని జాగ్రత్తగా ఎడమచేతిలో పట్టుకునే వున్నాడతను. కుడిభుజం నుంచి రక్తం వుండి వుండి స్రవిస్తోంది.

కోయిల రక్త స్రావాన్ని గుర్తించింది. కాని, వైద్యానికి కావలసిన ఆకులు అందుబాట్లో లేకపోవటంతో ఏమీ చెయ్యలేక ఊరకుండిపోయింది.

కొద్ది కొద్దిగా వెలుగు పరచుకొంటున్న ఆ ప్రభాత వేళ హఠాత్తుగా, మేట వేసిన ఇసక పక్కనుంచి ఓ ఆకారం లేచి కోయిలమీద కెగిరి దుమికింది.

ఆమెను కొన్ని గజాల వెనకగా వస్తూన్న సిద్ధార కళ్ళబడిందా దృశ్యం. ఒక్కక్షణం తొట్రుపడ్డాడు. అంతే! వెంటనే చాలా వేగంగా బాణం సంధించి వదిలాడు.

ఇంకో క్షణం ఆలస్యమైతే కోయిల జీవితం అంతమై పోయేది! సరిగ్గా బాణం ఆ ఆకారం గొంతులో బలంగా నాటుకోవటం, వెంటనే అది దబ్బున ఇసకలో పడి పోవటం, కోయిల ఎలర్ట్ కావటం వెంట వెంటనే జరిగి పోయాయి.

సిద్ధార నాలుగడుగుల్లో ఆమెను చేరుకున్నాడు.

కిందపడ్డ ఆకారాన్ని ఆశ్చర్యంగా చూశాడు.

ఒంటినిండా నల్లటి బొచ్చుతో, పొడవాటి మూతితో

కోరపళ్ళతో చాలా వికృతంగా వుందా ఆకారం. గొంతులో నాటుకున్న బాణం దాని ప్రాణాన్ని పూర్తిగా తియ్యలేకపోయింది. ఇంకా డొక్కలు ఎగరేస్తూనే వున్నది.

“చాలా ఘోర ప్రమాదంనించి కాపాడావు, నీకు నా కృతజ్ఞతలు.” అన్నది కోయిల అతనివంక ఆరాధనగా చూస్తూ.

“దీన్నేమని పిలుస్తారు? ఇది కూడా మనుషుల్ని చంపి తింటుందా?” అడిగాడు సిద్ధార్థ.

కోయిల అతనివంక ఆశ్చర్యంగా చూసి, “ఇది చాలా ప్రమాదకరమైన జంతువు. దాన్ని ఎడారి భల్లూకం అని పిలుస్తాం. ఒక దెబ్బతో మనిషినిగాని ఏదైనా జంతువునిగాని క్షణంలో చంపి అరగిస్తుంది. నీవు ప్రమాదాన్ని చాలా తొందరగా గుర్తించి నన్ను రక్షించావు.” అన్నది.

“నువ్వు నన్ను రెండుసార్లు రక్షించావు, లేకుంటే నేనంటూ వుండేవాడినా?”

“అయితే నా కిప్పుడు ఘోర్క్ జాతి నివసించే స్థావరానికి సరైన దారి తెలిసిపోయింది. ఎడారి భల్లూకాలు నివసించే ప్రాంతానికి సమీపంలోనే ఘోర్క్ జాతి నివసిస్తోంది.” అన్నది కోయిల ఆనందంగా.

“గుడ్.... అయితే ఇప్పటికి మనం సరైన దారిలోకి వచ్చామన్నమాట!”

“అవును. నా ప్రతిన చెల్లించుకునే అవకాశం కొద్ది గంటల్లో నాకు లభించబోతోంది.” అన్నదామె అతని చెయ్యి పట్టుకుని భావావేశంతో ఊగిపోతూ.

తన చేతిని వెనక్కి తీసుకోవాలనుకున్నాడు సిద్ధార్థ.

కాని ఆమె సంతోషాన్ని భగ్నం చెయ్యలేకపోయాడు.

కోయిల చటుక్కున అతని చేతిని గాఢంగా చుంబించింది.

ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. ఏమిటీమె అంతర్యం? కేవలం తన కోరిక నెరవేర బోతున్నదన్న సంతోషంతో అలా చిటిపిల్లలా కేరింతలు కొడుతూ, తనతో ఆ ఆనందాన్ని పంచుకుంటోందా? లేక ....!?

తల విదిలించాడు. ఆమె వైపు తల తిప్పి సూటిగా ఆమె ముఖంలోకి చూశాడు.

కోయిల కళ్ళు వింత కాంతితో ప్రకాశిస్తూన్నాయి. అలాంటి కాంతి, తను సుస్మిత కళ్ళలో చూశాడు, ఆమె తనతో గడిపిన చివరి క్షణాల్లో. తనమీది ప్రేమను వెల్లడించిన అపురూప క్షణాల్లో ఇలాగే వున్నాయామె చూపులు. అంటే, కోయిలకూడా ....!?

అతనికి తన ప్రేయసి దివ్య కూడా అదే క్షణంలో గుర్తొచ్చింది. ఆమె తనతో గడిపిన సాయంత్రాలు ఎన్నో సార్లు తన కళ్ళలో కళ్ళు పెట్టి ఇలాగే చూసేది. ఇదే కాంతి ఆమె కళ్ళలో కూడా!

ఊహూ, కోయిల కళ్ళలో విరుస్తున్న కాంతి అలాంటిది కాదు, కానేకాదు. ఆమె అమాయకురాలు, ఇలాంటి వేమీ తెలియని పసి మనస్తత్వం. తను అనవసరంగా ఆమె చర్యలకి భాష్యం మరోలా చెప్పుకుంటున్నాడు.

తనని తాను సమాధాన పరచుకోవటానికి ప్రయత్నిస్తూ చూపులు తిప్పుకున్నాడు. కాని కోయిల ఇంకా తదేకంగా అతనివైపే ఆర్తిగా, ఆరాధనగా, అపురూప వస్తువును చూసినట్టు చూస్తోంది.

సిద్ధార్థకి సిగ్గనిపించింది. కాని, కోయిల ఏ మాత్రం సంకోచం లేకుండా అతన్నే చూస్తోంది.

అయిదు నిమిషాలు భారంగా గడిచాక. "ఇక తెల్లవారటానికి అట్టే సేపు లేదు. కదులుదామా?" అన్నాడు.

కోయిల అప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్టు అతని మీది నుంచి చూపులు తిప్పుకుని, "బయల్దేరుదాం." అన్నది.

ఇద్దరు మళ్ళీ ముందుకు సాగారు.

కోయిల చాలా ఉత్సాహంగావుంది. తన కోరిక త్వరలో నే నెరవేరబోతున్నందుకు, సరైన దారిలో నే తమ ప్రయాణం సాగుతున్నందుకు ఆమె కెంతో ఆనందంగా వుంది.

కాని, ఆ ఆనందం ఎంతో సేపు ఆమెకు దక్కలేదు. ఎడారి భల్లూకాలు సంచరించే ప్రాంతానికి ఘోర్క జాతి బందిపోట్లుండే స్థావరం చాలా దగ్గరని ఆమె భావించిందే గాని, ఆ భల్లూకాలు తనదారి కడ్డు తగుల్తాయని కల్లో కూడా అనుకోలేదు.

ప్రమాదాన్ని ఈసారికూడా సిద్ధార్థే ముందుగా గ్రహించాడు. "కోయిలా!" అంటూ హెచ్చరికగా అరిచాడు.

కోయిల త్రుళ్ళిపడి వెనుతిరిగి చూసింది.

ఒకటికాదు, రెండుకాదు, పదుల సంఖ్యలో ఎడారి భల్లూకాలు వారివైపు వేగంగా దూసుకొస్తున్నాయి.

కోయిల వెంటనే రియాక్టయింది. అంబుల పొది నుంచి బాణం తీసి సంధించింది. కాని బాణం వదలటానికి సంకోచించింది.

ఒకటో రెండో అయితే ఫరవాలేదు. అధిక సంఖ్యలో వున్నవాటిని పాతిమార్చటం తమిద్దరి తరంకాదు. దెబ్బ తిన్న భల్లూకాలు ఎలా రెచ్చిపోతాయో ఆమెకు బాగా తెలుసు.

వాళ్ళకు ఆ భల్లూకాలకు కేవలం కొన్ని అడుగుల దూరం మాత్రమే వుంది.

దిక్కుతోచని స్థితిలో ఇద్దరూ అలాగే నిల్చుండి పోయారు.

* * *

దివ్య మాటిమాటికీ వాచీ చూసుకుంటూ గుమ్మం వైపు చూస్తోంది.

ఈ పాటికి రావలసిందే సిద్ధార్థ. ఎందుకని రాలేదు చెప్మా? ...డ్యూటీ దిగగానే ఏర్‌పోర్టు నుంచి సరాసరి తనని చూడటానికే వస్తానని ఢిల్లీ వెళ్ళేముందు తనకి ప్రామిస్ చేశాడు.

సిద్ధార్థ మాట నిలుపుకునే మనిషి! అందులో ఆవంతైనా అనుమానంలేదు. ఇంకా ఢిల్లీనుండి రాలేదేమో !?

అతని గురించి తలుచుకొనే కొద్దీ ఆమెకు అతన్ని చూడాలనే కోరిక అధికమవుతోంది.

పదే పదే అతని చిలిపిమాటలు, అతని సుందరవదనారవిందం, అతని చేష్టలు గుర్తొస్తున్నాయి,

అతను ఢిల్లీ వెళ్ళేముందు రోజు సాయంత్రం అతనితో గడిపిన క్షణాలు గుర్తొచ్చాయి. మనసు గిలిగింతలతో పులకించిపోయింది....

ఇద్దరు పబ్లిక్ గార్డెన్స్‌లో పక్క పక్కనే కూచుని

వుండగా అతను తనని ఏడిపించటానికి ఏర్ హోస్టెస్‌ల ప్రస్తావన తెచ్చి వాళ్ళ అందాలని పూరకే పొగడటం మొదలెట్టాడు.

తనకి సహజంగానే ఉడుకుమోత్తనం వచ్చేసింది. మూతి బిగించుకుని పక్కకు ముఖం తిప్పుకుని కూచుంది.

సిద్ధార్థ భయం నటించి, శిరస్సు అలవోకగా వంచి నాటక ఫక్కీలో, "భక్తుడ్ని అనుగ్రహించు దేవీ, కోపించకు!" అన్నాడు. అతని కళ్ళు అల్లరిగా నవ్వుతున్నాయి.

చిరుకోపంతో అలవోకగా అతనివంక చూసింది తను. అతనా మాటలు పలికిన తీరు, నిల్చున్నతీరు చూసి నవ్వేసింది ఫక్కున.

"హమ్మయ్య, కరుణించావా దేవీ! అంతే చాలు ఈ దీనుడికి!" అన్నాడు సిద్ధార్థ తన కళ్ళలో కళ్ళు కలిపి, కనుబొమ్మలు కొద్దిగా పైకి లేపుతూ.

"ఛీ, ఏమిటా రౌడీ చూపు? అందరమ్మాయిల వంక అలాగే చూస్తూన్నావా?" అన్నది తను.

"అపచారం, అపచారం! అసలు నేను అమ్మాయిల వంక కన్నెత్తి చూడనే—నిన్ను తప్ప!"

"ఉహూ, అలాగేం? ఈ డైలాగ్ ఎంత మంది అమ్మాయిలతో వల్లించావో !?"

"హతోస్మి! అంత ఘోరంగా అనుమానించటం న్యాయంకాదు దివ్యా! నేనలాంటి చపలచిత్తుణ్ణి, గ్రంథసాంగుడ్ని కాదు. నామాట నమ్మలేవా ప్రియా!?"

"చేయి చాస్తే అందేంత దూరంలో, అందంగా అలంకరించుకుని ఫ్యాషన్ పెరేడ్‌లో పాల్గొనడానికి

సిద్ధంగా వున్నట్టు వోయిలు ఒలకబోస్తూ, ప్యాసింజర్లని ఆహ్వానిస్తూ చిరునవ్వుల్లో ముంచెత్తుతూ ఎయిర్ హోస్టెస్‌లు కళ్ళముందు మెరుపుతీగెల్లా మెరుస్తూంటే చలించలేక పోవటానికి నువ్వేమైనా బుుశ్యశృంగుడివా, ఇనప కచ్చడాలో ధరించిన మునిపుంగవుడివా....!?" తన కసినంతా ఆ మాటల్లో కళ్ళబోసుకుంది తను.

"స్టాప్. స్టాప్! నా తెలుగు పరిజ్ఞానమే అంతంత మాత్రం. నీ సంస్కృత సమాసాల్ని అర్థం చేసుకుని జీర్ణించుకోవటం అంత సులభసాధ్యమా? దయచేసి, అచ్చ తెలుగులో బుల్లి వాక్యాలు మాట్లాడు సఖీ!" అంటూ వాపోయాడు సిద్ధార్థ

"నేను మాట్లాడేది అచ్చ తెలుగే విమాన చోదకా!"

"అదేమిటి, మళ్ళీ మరో కొత్తమాట! అర్థంకాలేదు చెలీ!"

"పైలట్‌కి తెలుగు అనువాదం, సంస్కృత మిశ్రిత మైన తెలుగు మాట!"

"అదేం వద్దు ప్రాణేశ్వరీ! పైలట్‌గా నీ వ్యవహారించు, చాలు!"

"నువ్వేమిటి—సఖీ. చెలీ, ప్రియా ప్రాణేశ్వరీ అంటూ అలా కలవరించిపోతున్నావ్....!?"

"ఏం చెయ్యను మరి! అలా కలల్లో కలవరించటమే గాని, నువ్వు వరించటంలేదు కదా...."

"అక్కడికి తప్పంతా నాదేనంటావు....! నువ్వు ఎప్పంటే నేను కాదంటావా? గ్రీన్ సిగ్నల్ రావల సింది నీవైపునుంచే! నీ చెల్లెళ్ళ పెళ్ళి అయ్యాకనే మన పెళ్ళి అన్నావు మరచిపోయావా."

ఒక్కసారిగా అతను మౌనం వహించాడు. అతని ముఖంలో యెన్నో భావకందని భావాలు కదలాడాయి.

"అవును దివ్యా....!? నా తర్వాత వాళ్ళిద్దరు ఆడపిల్లలేనని, వాళ్ళ పెళ్ళిళ్ళు జరిపించాల్సిన బాధ్యత ఇంటికి పెద్దకొడుకుగా నా మీదనే వుందని నాన్నగారు రిటైరై నాలుగేళ్ళయిందనీ—ఇవన్నీ తెలిసి తెలిసి, మన పెళ్ళి గురించి ఒత్తిడి తేవటం న్యాయమా దివ్యా?"

అతని గొంతులోని ఆర్ద్రత తనని కదలించివేసింది.

చటుక్కున అతని అరచేతిని తన చేతుల్లోకి తీసుకుని "సారీ సిద్ధూ! నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళయ్యాకనే మన పెళ్ళి. సరేనా!?" అన్నది తను చిన్నగా నవ్వుతూ.

నియాన్ లైట్లు పబ్లిక్ గార్డెన్స్ని పట్టపగలుగా మార్చేశాయి. ఒకరొకరు మెల్లగా ఇంటిముఖం పడ్తున్నారు.

"ఇక వెళ్దామా?" అన్నాడు సిద్ధార్థ.

"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?" అన్నది తను. అతని కళ్ళలో దేనికోసమో వెతుకుతున్నాయి తనకళ్ళు ఆత్రంగా. అతనితో విడిపోయే ప్రతిసారీ మళ్ళీ అతన్ని చూడలేనేమోనని భయం వేస్తోంది. మళ్ళీ అతను తనని చూడటానికొచ్చేవరకు అంతులేని టెన్షన్ మనసుని నొక్కిపడ్తుంది.

"రేపురాత్రి ఫ్లైట్లో ఢిల్లీ వెళ్తున్నాను. ఎల్లుండి ఢిల్లీనుంచి తిరిగొస్తాను. డ్యూటీ దిగగానే సరాసరి మీ ఇంటికి వచ్చేస్తాను. యెక్కడికి వెళ్ళాలో ఏం షాపింగ్ చెయ్యాలో ప్రోగ్రాం ఫిక్స్ చేసి వుంచు నేనొచ్చేసరికి!" అతని కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

తను దిగులుగా తల వూపింది.

అతను వెళ్ళిపోయాడు.

అదంతా గుర్తొచ్చి మనసంతా భారంగా అయిపోయింది దివ్యకి.

ఈ రోజు ఉదయానికే అతను ఢిల్లీ నుంచి తిరిగి రావలసి వుంది.

చీకటి పడిపోయింది. అయినా అతను తిరిగిరాలేదు. ఏమైంది? ఫ్లైట్ సరిగ్గా సమయానికి బయల్దేరలేదా? లేక ఏ కారణం చేతనైనా ఢిల్లీలో ఆగిపోయి తర్వాతి రోజు బయల్దేరుతున్నాడా?

అసహనంగా తల విదిలించింది దివ్య.

అతన్ని చూసి ఎన్నో నెలలయిపోయినట్లుంది. మూడు రోజులే అయినట్టులేదు. అతన్ని చూడాలని మనసు ఆరాటపడుతోంది. అతనితో యెన్నో కబుర్లు చెప్పుకోవాలని, జోక్స్ కట్ చేసుకుంటూ హాయిగా నవ్వుకోవాలని చాలా తపనగా వుంది.

కాని అతను రాలేదు. ఇంట్లో అమ్మతో చెప్పి రకరకాల పిండివంటలు కూడా చేయించి సిద్ధంగా వుంచింది. అమ్మకి, నాన్నకి కూడా సిద్ధార్థ అంటే చాలా ఇష్టం. అతని వ్యక్తిత్వం వాళ్ళకి బాగా నచ్చింది.

అతను చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యతలు తీర్చుకున్న మరుక్షణంలో అతనితో తన పెళ్ళి జరిపించటానికి తనవాళ్ళు సిద్ధంగా వున్నారు.

నాన్నగారు పెద్ద హోదాలో వున్నారు. నిజానికి సిద్ధార్థకన్నా చాలా పెద్ద సంబంధాలు కూడా వచ్చాయి తనకి. కాని, తన మనసెరిగిన నాన్న అప్పుడప్పుడే

తన పెళ్ళి చేయబోవటం లేదని వాళ్ళని సున్నితంగా తిరస్కరించారు. అలాంటి తండ్రి కడుపున పుట్టడం తన పూర్వజన్మ సుకృతం!

టెన్షన్‌తో, నిరాశతో హాల్లో లేచి పచార్లు చేస్తున్న దివ్య టెలిఫోన్‌ని చూడగానే చటుక్కున అటు కదిలింది.

ఛ. ఇంత సేపూ తన కెందుకు తట్టలేదు? ఏర్‌పోర్టుకి ఫోన్ చేసి కనుక్కుంటే పోయేదిగా! ఒక్కోసారి మెదడు మొద్దుబారిపోయి ఆలోచనలేరావు.

ఒక్క అంగలో ఫోన్ అందుకుని, డైరెక్టరీలో నంబరు చూసి ఎర్‌పోర్టుకి రింగ్ చేసింది దివ్య.

అటు ఎవరో ఫోన్ ఎత్తారు.

"హాలో, ఈజిట్ ఏర్‌పోర్టు?" అడిగింది దివ్య.

* * *

ఏదో అద్భుతం జరిగితే తప్ప తమని, ఆ ఎడారి భల్లూకాల బారినుంచి ఎవరూ రక్షించలేరని భావించాడు సిద్ధార్థ.

కోయిల మెదడు పాదరసంలా పని చేసింది.

"ఎడారి భల్లూకాలు శవాల్ని ముట్టవు. వెంటనే నేల మీద పడుకుని ఊపిరి బిగబట్టు!" అన్నది కోయిల.

మరుక్షణం ఇద్దరు ఇసకలో వెల్లకిలా పడుకుని ఊపిరి బంధించారు.

వాళ్ళని సమీపించిన భల్లూకాలు కదలిక లేకుండా పడున్న వాళ్ళని సంశయంగా చూశాయి.

సిద్ధార్థ కళ్ళుకూడా గాఢంగా మూసేసుకున్నాడు.

భల్లూకాల శరీరం మీదుగా వస్తున్న దుర్వాసనతో

బాటు వాటి ఊపిరి వాటి సామీప్యత అతనికి స్పష్టంగా తెలుస్తూన్నాయి.

ఓ భల్లూకం అతని ముఖంమీద తన ముఖాన్ని పెట్టడం కూడా అతను గుర్తించాడు. ఏ మాత్రం చలించలేదు. కోయిల పథకం ఫలిస్తే తామిద్దరు బతికి బయట పడతారు. లేదా, ఎలాగూ చావు తప్పదు!

భల్లూకం ఒంటిమీదున్న బొచ్చు అతని ముక్కు రంధ్రాల దగ్గర ఇర్రిటేషన్ కలిగించింది. తుమ్మురాబోతే బలవంతాన ఆపుకున్నాడు.

కొన్ని క్షణాలు చాలా భయంకరంగా, అతి భారంగా గడిచాయి.

భల్లూకాలు తమాసేం చెయ్యకుండానే అక్కడ్నుంచి వెళ్ళిపోయాయని గ్రహించాడు సిద్దార్థ.

ఇప్పుడు వాటి శరీరాల దుర్గంధంగాని, వాటి ఉచ్ఛ్వాస నిశ్వాసాల సవ్వడిగాని వినిపించటంలేదు.

"అవి వెళ్ళిపోయాయి" అన్నది కోయిల చెవిదగ్గర.

కళ్ళు తెంచాడు సిద్దార్థ. అప్పటికే వేడెక్కిపోయిన ఇసక వీపును కాల్చేస్తోంది. గాలిలో వేడిసెగలు వ్యాపించాయి. కళ్ళు విపరీతంగా మండుతున్నాయి. అలవాటు లేని వాతావరణం తన ప్రభావాన్ని శరీరంమీద చూపిస్తోంది.

కోయిల ముఖంవైపు చూశాడు. ప్రశాంతంగా వుంది. చిన్నగా నవ్వుతోంది.

"నీ సమయస్ఫూర్తి మెచ్చుకోదగ్గది." అన్నాడు సిద్దార్థ.

"మన భుజబలం ఎందుకూ కొరగాదనుకున్నప్పుడు

బుద్ధిబలాన్నే ఆశ్రయించాలి కదా!" అన్నది కోయిల.

ఆమె తనూహించినట్టు అమాయకురాలు కాదని, తెలివి, చురుకుపాలు, తెగువ, అభిమానం, పౌరుషం, కార్యదీక్ష అన్నీ సమపాళ్ళలో వున్నాయామెలో. నాగరికులకన్న ఆ ఎడారిపిల్లే ఎంతో నయం అనుకున్నాడు.

సరిగ్గా అప్పుడే బుస్‌మంటూ ఛీత్కారాలు వినిపించాయి.

త్రుళ్ళిపడి చూశాడు సిద్ధార్థ.

ఎదురుగా తోకమీద నిల్చుని నాట్యం చేస్తున్నాయి. ఇసకరంగులో కలిసిపోయి రక్షకవర్ణం కలిగివున్న క్రూర సర్పాలు!

అసలు ఇంతసేపూ అవి తమపక్కనే ఇసకలో ఎక్కడో దాగొని వుండొచ్చుననే ఊహ రాగానే అతని ఒళ్ళు గగుర్పొడిచింది.

చటుక్కున వెనక్కి జరిగాడు. సరిగ్గా అతన్ని కాటందుకోబోయిందో సర్పం. దాని ప్రయత్నం సగంలో వుండగానే ధనుస్సుతో దాని తలమీద గట్టిగా మోదింది కోయిల.

టప్‌మనే శబ్దంతో అల్లంత దూరంలో పోయిపడిందా సర్పం.

ఈ లోపల తన చేతిలోని కత్తికి పని చెప్పాడు సిద్ధార్థ.

దాదాపు పది పన్నెండు సర్పాలు కల కలలాడుతూ వాళ్ళని చుట్టుముట్టాయి.

"ఇక్కడ చాలా విషపూరితమైన కాలనాగు లుంటా యనే విషయం ముందుగా నీకు హెచ్చరించటం మరి

చాను. బహుశా. నువ్వు దేన్నో తోక తొక్కి వుంటావు. అందుకే అవి పేట్రేగిపోతున్నాయి. నేను దారిచేస్తాను వీటి మధ్యనుంచి. నువ్వు నా వెనకే పరుగెత్తుకొచ్చెయ్యి." అంటూ తమ కెదురుగా తోకలమీద నాట్యం చేస్తున్న ఆ సర్పాల వైపు ఓసారి చూసి ధనుస్సుతో అడ్డుగా వున్న రెండు సర్పాల్ని దూరంగా విసిరేసింది కోయిల. ఎగిరి గెంతింది అవతలకి.

ఆమె వెనకనే సిద్ధార్థ కూడా గెంతాడు. ఇద్దరూ కొన్ని గజాలవరకు ఆగకుండా పరుగెత్తారు.

"తమకేదైనా హాని కలిగిస్తే ఈ సర్పాలు పగపడతాయని మేమంతా నమ్ముతాం. నన్ను పాము కాటు వెయ్యదు. వేసినా విషం ఎక్కదు." ముంజేతికి కట్టుకున్న ఓ మూలికను చూపించింది కోయిల.

సిద్ధార్థ ఆమె నమ్మకాన్ని కాదనటం ఇష్టంలేక తల పంకించి వూరుకున్నాడు.

అప్పుడు మధ్యాహ్నం పదకొండున్నర గంటలయింది. అతనికి చాలా ఆకలిగావుంది. నిస్త్రాణగాను వుంది. అంతసేపు పైకి చెప్పకోలేదుగాని, దాహం విపరీతంగా వేస్తోంది.

కోయిల అతని పరిస్థితిని గుర్తించింది.

"నన్ను క్షమించు. నా హడావిడిలో నీ విషయం పట్టించుకోలేకపోయాను. ఎడారికి కొత్తవాడివైన నువ్వు ఆకలిదప్పులకు తట్టుకోలేవన్న నిజాన్ని విస్మరించాను. నా అంచనా ప్రకారం ఇక్కడికి దగ్గర్లోనే ఒయాసిస్ వుండాలి. చల్లటి నీరు కడుపునిండా తాగొచ్చు. అంతే కాదు, ఆ పక్కనే కమ్మటి ఖర్జూరప్పళ్ళు కూడా

వుంటాయి. ఆకలి తీర్చుకోవచ్చు" అన్నది.

ప్రాణం లేచి వచ్చింది సిద్ధార్థకి.

అయితే ఆదేసమయానికి వాళ్ళకి చాలా సమీపంలో ఇసక గాల్లోకి లేపుకుంటూ అటే వస్తున్న నాలుగు ఒంటెలు కనిపించాయి.

కళ్ళు చిట్లించి చూసింది కోయిల. ఆమె చూపు చాలా సునిశితమయ్యిందనటానికి సూచనగా ఆమె క్షణాల్లో ఎలర్ట్ యిపోయి సిద్ధార్థ వంక అలజడిగా చూసింది.

"వాళ్ళు.... వాళ్ళు ఘోర్క్ జాతి బందిపోట్లు. ఏదో సమీప గ్రామానికి దోచుకోవటానికి బయల్దేరారు. చూడు, వాళ్ళనేం చేస్తానో " అంటూ అంబుల పొదినుంచి బాణంతీసి వింటికి సంధించి చెవిదాకా నారి లాగి వదిలింది.

గాలిని సర్న కోసుకుంటూ మహావేగంగా దూసుకు పోయింది బాణం.

ఆ వెనువెంటనే బాధాకరంగా ఓ ఆర్తనాదం వెలువడింది.

ఒంటెమీదినుంచి అమాంతం నేలమీదికి పడిపోయాడో బందిపోటు.

ఒకటి తర్వాత మరొకటిగా ఆమె నాలుగు బాణాలు వదిలి నలుగుర్నీ నేలకూల్చేసింది.

ఆమె లాఘవానికి, గురికి నిశ్చేష్టుడైపోయాడు సిద్ధార్థ.

ఆమె ముఖంలో అనిర్వచనీయమైన సంతృప్తి అంతవమింపిన ప్రశాంతత గమనించిన సిద్ధార్థ ప్రశంసాపూర్వకంగా చూశాడామె వంక.

"పద, మన ప్రయాణానికి మళ్ళీ ఒంటెలు దొరి
కాయి" అన్నది చిరునవ్వుతో కోయిల.

ఇద్దరు ఒంటెల్ని సమీపించారు.

నేలకూలిన బందిపోట్లను కాలితో తన్ని వాళ్ళు మర
ణించిన విషయం ధృవ పరచుకొంది కోయిల.

నలుగురి గుండెలమీద రెండుకాళ్ళతోను కుమ్ముతూ
కసిదీరా వికటాట్టహాసం చేసింది కోయిల.

ఆ సమయంలో ఆమె ముఖంవైపు చూడటానికి భయ
పడిపోయాడు సిద్ధార్థ. మహిషాసుర మర్దనం చేస్తూన్న
కాళీమాతిలా కనిపించింది. కళ్ళు అప్రయత్నంగా మూసు
కున్నాడు.

ఓ పది నిమిషాలవరకు ఆమె ముఖం అలా నెత్తురు
గడ్డలా ఎర్రగానే వుంది. ఆ తర్వాత తన ప్రశాంత,
ప్రసన్నవదనం అతనివైపు తిప్పి చిన్నగా నవ్వింది.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు సిద్ధార్థ.

"మనం సాయంత్రానికల్లా వాళ్ళ స్థావరం చేరి
పోతాం. దగ్గరకొచ్చాం" అన్నది కోయిల.

తల పంకించాడు సిద్ధార్థ.

ఆమె బందిపోట్ల శరీరాలనుంచి బాణాలను లాక్కొని
మళ్ళీ అంబులపొదిలో పెట్టుకుంది—వాళ్ళ రక్తాన్ని వాళ్ళ
దుస్తులకే తుడిచి—

"ఇవి ప్రత్యేకంగా తయారుచేసిన వాడి బాణాలు.
బాణం శరీరానికి తగిలిన మరుక్షణం వెన్నులోంచి బయ
టకు పొడుచుకు వెళ్తుంది. తక్షణం శత్రువు ప్రాణం
వదులాడు" చెప్పింది కోయిల.

రెండు ఒంటెలను ఆమె ఎన్నుకుంది. ఓ దానిమీద
సిద్ధార్థను కూర్చుండజేసి, రెండో దానిమీద తను అధిరో

హించింది. ఒంటెలను అవి వచ్చిన దిశలోనే మళ్ళించింది. ఇప్పుడు బందిపోట్ల స్థావరాన్ని తాము వెతుక్కోవలసిన శ్రమ తప్పింది. అలవాటుపడ్డ ఒంటెలు ఘోర్క్ బందిపోట్ల నివాసస్థలానికి సరాసరి సాగిపోతున్నాయి.

* * *

ప్రయాణం ఒక గంటసేపు సాఫీగా సాగింది.

సిద్ధార్థను అరికాలిచప్పులతోబాటు గాయపడిన భుజం కూడా బాధ పెడుతోంది. పళ్ళబిగువున బాధలన్నీ భరిస్తున్నాడు.

కోయిల ఒకచోట చటుక్కున ఒంటెనాపింది. చెంగున కిందికి దూకింది. అర్థంకాక చూశాడామె వంక సిద్ధార్థ.

కోయిల ఓ పక్కగా నేలబారుగా వున్న ఓ మరుగుజ్జు మొక్కను సమీపించి దాని ఆకుల్ని తెంచింది.

ఆ మొక్క తప్ప కనుచూపు మేరలో ఎక్కడా ఎలాంటి మొక్కలుగాని, చెట్లుగాని లేవు. సిద్ధార్థకు వింతగా తోచింది.

కోయిల అతన్ని సమీపించి చెంగున ఒంటెమీద కెగిరి కూచుంది.

"ఇలా పట్టు" అంటూ భుజంపైన ఆకురసం పిండింది. చల్లగా నవనీతంలా సోకింది ఆకుపసరు. సిద్ధార్థ బాధ చేత్తో తీసేసినట్టయింది ఉపశమనం కలిగింది.

కృతజ్ఞతగా ఆమె వంక చూసి, "నువ్వు అనుక్షణం నా క్షేమం గురించే ఆలోచిస్తున్నావని అర్థమయింది. కృతజ్ఞుణ్ని!" అన్నాడు.

"నాకు కృతజ్ఞతలు చెప్పొద్దు ఈ గాయం నా శత్రువుల్లో ఒకడైన ఘోర్క్ బందిపోటు చేసినది. ఆ

జాతిమీద ప్రతీకారం తీర్చుకునే వరకు మనం విశ్రమించం"
అన్నది కోయిల దృఢంగా.

సిద్ధార్థకు కూడా ఆ మాటలతో వీరావేశం వచ్చింది. అవును, దెబ్బకు దెబ్బతియ్యాలి! సుస్మితవంటి అన్నెం పున్నెం ఎరగని అమాయకురాలి ప్రాణాలు పొట్టన పెట్టుకొన్న ఆ రాక్షసుల అంతు చూడాలి!

సుస్మిత, కోయిల — యిద్దరూ తన ప్రాణదాతలే! చనిపోయిన సుస్మితకి ఆత్మ శాంతి, బతికున్న కోయిలకి మనశ్శాంతి కలిగించటం తన విధ్యుక్త ధర్మం!

పసరుపిండటం పూర్తి చేసి అతని కళ్ళలోకి చూసి వెన్నెల్లా నవ్వింది కోయిల. బదులుగా సిద్ధార్థ కూడా నవ్వాడు.

ఏమిటో, ఈ ఎడారిపిల్ల మనసు! అప్పటికప్పుడే క్రోధంతో అపరకాళిలా కనిపిస్తుంది. అంతలోనే అమాయకమైన ముఖంతో అప్పుడే పుట్టిన పసిపాపలా అనిపిస్తుంది. ఆమె, ఈమె ఒకరేనా అని సందేహాన్ని కలిగిస్తుంది.

కోయిల అతని ఒంటెమీదినుంచి కిందికి దూకి తిరిగి తన ఒంటెపై కెక్కింది.

సరిగ్గా అప్పుడే వాతావరణంలో అనుకోని విపరీతమైన మార్పు వచ్చింది. ఆ మార్పు ఏమిటో వాళ్ళు గ్రహించేలోపల ఒక్కసారిగా ప్రళయ ఝుంఝూమారుతం మహోధృతంగా వీచింది.

గాలికన్న వేగంగా ఎర్రగా కాలుతున్న ఇసక ఉవ్వెత్తున లేచింది పైకి. హోరుమని సముద్ర ఘోషలా, ఒక్కసారిగా వేయిమంది రాక్షసులు హోయని అరుస్తున్నట్టు చెవులు చిల్లులు పడే రొద వాళ్ళని చెవిటి

వాళ్ళనుగా మార్చేసింది.

రెండు చేతుల్తోను కళ్ళు మూసేసుకున్నా నోట్లోకి, ముక్కుల్లోకి ఇసక ఈడ్చి కొడుతోంది. కాలుతున్న ఇసక సున్నితమైన ముఖ భాగాలని తాకగానే నిప్పులు ముఖాన కుమ్మరించినట్టనిపించింది.

కళ్ళు తెరవటానికేమాత్రం అవకాశం లేదు. ఒళ్ళంతా ఇసక. నెత్తిమీద ఇసక. గుడ్డల్లోనించి శరీరం మీదికి ఉధృతంగా పాకుతున్న ఇసక. ఎటూ కదల్లేని అగమ్య స్థితి.

ఒకరి కొకరు ఎక్కడున్నారో తెలియదు. ఏమై పోతున్నారో, ఏం జరగబోతోందో అంతా అయోమయ పరిస్థితి.

అయితే అతనికి తెలుస్తూనే వుంది—అది ఇసక తుఫాన్ అని, అలాంటిదే గతంలో సుస్మిత, తాను పారాచూట్‌లో గాల్లో తేలివస్తున్న సమయంలో సంభవించిందనీను. అయితే, అప్పుడు తామిద్దరు భూమికి చాలా ఎత్తులో ఎగురుతున్న కారణంగా తుఫాను తాకిడి తమ కంతగా సోకలేదని ఇప్పుడు తెలిసి వచ్చింది.

అంతకంతకు గాలి హోరు హెచ్చింది. ఇసక సముద్ర కెరటాల్లా ఉవ్వెత్తున లేచి మేటలు వేస్తోంది. వర్షంలా కురుస్తోంది.

ఉన్నట్టుండి తాను గాల్లో తేలిపోతున్నట్టు గ్రహించాడు సిద్ధార్థ. కళ్ళు తెరిచి చూద్దామనుకున్న అతని ప్రయత్నం ఏ మాత్రం ఫలించలేదు. శాశ్వతంగా గుడ్డి వాడైపోతానని గ్రహించాడు. కళ్ళు మూసుకునే గాలి ప్రచండ వేగానికి పైకి పైపైకి ఎక్కడికో తేలిపో

తున్నాడు. విమానంలో పయినించేటప్పుడు యెలాంటి కదలికలు అనుభవిస్తాడో అదే అనుభూతి!

అంటే....తను గాలిలో బాగా ఎత్తులో తేలిపోతున్నాడా? గాలికింత వేగముంటుందని విమానాలని నడిపే తనకే ఇన్నాళ్ళు తెలియదు.

కోయిల ఏమయింది? ఆమె కూడా తనలాగే గాలిలో తేలిపోతూ యెక్కడికో ఎగిరిపోతోందా?....ఏమో!....

ఆ సమయంలో అతను, నూరు యోజనాల విస్తీర్ణం గల సముద్రాన్ని దాటడానికి గాలిలో ఎగిరి వెళ్ళిన హనుమంతుడిలా వున్నాడు.

దాదాపు పది నిమిషాలు అలా గాలిలో యెగురుతూ యెక్కడికో విసిరి వేయబడ్డాడు సిద్ధార్థ.

అయితే నేలమీద పడిపోతుండగా అతని శరీరానికి తాకింది ఇసక కాదు—ఒత్తుగా పెరిగిన పచ్చిక!

నేలని తాకుతుండగానే సిద్ధార్థకి స్పృహ తప్పిపోయింది.

• • •

"వ్వాట్, సిద్ధార్థ ఫ్లైయిట్ నించి జారి పడిపోయాడా? నెవ్వర్, ఇట్స్ నాట్ ట్రూ!" ఫోన్ లో గట్టిగా అరిచింది దివ్య.

"మేమే వచ్చి మీకు స్వయంగా ఈ విషయం తెలియచెయ్యాలనుకుంటున్నాం మేడమ్! మాకిప్పుడే ఇన్ఫర్మేషన్ వచ్చింది...." ఏర్ పోర్టు అధికారి చెప్తున్నాడు.

ఆ మాటలేమీ వినిపించటంలేదామెకు. యెలా జరిగింది? పారాచూట్ లో విమానం నించి యెప్పుడు గాలిలోకి ఉరుకుతారో ఆమెకు తెలుసు.

కాని....విమానంలో అందరు క్షేమంగా వుండగా,

విమానాని కెలాంటి ప్రమాదం లేని సమయంలో గావా లని యెందుకు సిద్ధార్థ మాత్రమే పారాచూట్ లో విమానం నించి తప్పించుకున్నాడు?

అదే విషయమిడిగింది టెన్షన్ అణచుకుంటూ దివ్య.

"మేడమ్....మాకూ అదే అంతుబట్టడం లేదు— అతనితో బాటు ఓ ఏర్ హోస్టెస్ కూడా ఉరికింది పారాచూట్ లో."

వింటున్న దివ్య చేతివేళ్ళు రిసీవర్ ని గట్టిగా పట్టుకున్నాయి. అంతకన్న బలంగా చెవికి అదిమిపట్టింది రిసీవర్.

"ఏమిటి మీర నేది? ఏర్ హోస్టెస్ తో బాటు సిద్ధార్థ ఉరికాడా? సిద్ధార్థతో బాటు ఏర్ హోస్టెస్ ఉరికిందా?"

"అమ్మా, మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావటం లేదు. యెవరు ముందు వురికినా యెవరు తర్వాత ఉరికినా, జరిగింది మాత్రం ఇది."

దివ్యకి అప్పుడు అర్థమయింది. తను అర్థ రహితంగా మాటలాడుతున్నానని!

"సర్....సిద్ధార్థ గురించి క్షేమ సమాచారమేదైనా తెలిస్తే నాకు తప్పక రింగ్ చెయ్యండి. మా ఫోన్ నంబర్...." చెప్పింది దివ్య.

"ష్యూర్, ష్యూర్! మేం కూడా అతన్ని వెతికించటానికి ప్రయత్నిస్తున్నాం. అతనెక్కడో క్షేమంగా ల్యాండయి వుంటాడని మా విశ్వాసం!"

"భగవంతుడు దయామయుడు. అతను క్షేమంగా వుంటాడు, నాకు తెలుసు." ఆమె గొంతు వణికింది.

"ఉంటాం మేడమ్, గుడ్ నైట్!" చెప్పాడా అధికారి.

అతను ఫోన్ పెట్టేస్తుండగా కంగారుగా అడిగింది దివ్య! "సర్.... సిద్ధార్థ ఏ ప్రాంతంలో ప్లేన్ నుంచి బయట పడికాడో చెప్పగలరా?"

ఓ రెండు క్షణాల తర్వాత చెప్పాడాయన.

దివ్య థేంక్స్ చెప్పి ఫోన్ పెట్టేసింది.

ఒక్కసారిగా ఉధృతంగా దుఃఖం తన్నుకొచ్చిం దామెకు. సోఫాలో కూలబడి చేతుల్లో ముఖం దాచుకుని బావురుమన్నది.

"సిద్దూ, నువ్వెందుకలా చేశావు? ఎందుకోసమని, ఎవరికోసమని....?!" ఆమె హృదయం ఆక్రోశించింది.

అంతలోనే ఆమె స్త్రీ హృదయంలో ఓ అనుమాన బీజం పడింది.

సిద్ధార్థతో బాటు ఓ ఏర్ హోస్టెస్ కూడా పారా మూట్ లో బయటపడికింది. యెందుకు? యెవరామె? సిద్ధార్థకి ఆమెకి ఏమిటా బంధం? యెందుకూ ఇద్దరూ ఒకేసారి గాలిలోకి ఉరికేశారు?

ఎందుకు?

ఆమెకి యెంతకీ అంతుబట్టలేదు.

దుఃఖాన్ని నిగ్రహించుకుని, కళ్ళు తుడుచుకుని శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది దివ్య.

• • •

కంటిమీద చల్లటి స్పర్శ తగిలి చటుక్కున కళ్ళు తెరిచాడు సిద్ధార్థ.

తనో మెత్తటి ఒడిలో వున్నట్టు గ్రహించాడు. ఆ ఒడి తాలూకు స్త్రీమూర్తిని కళ్ళెత్తి చూసి నిర్ఘాంత పోయాడు.

దేవతా స్త్రీలను తలదన్నే లావణ్యం, సౌకుమార్యం

సంతరించుకున్న దివ్యాంగనలా వుందామె.

గులాబిరంగు శరీర కాంతి మిరుమిట్లు గొలుపుతోంది. తీర్చిదిద్దినట్లున్న కనుముక్కు తీరు పదేపదే ఆ ముఖాన్ని చూడాలనే కోరికను రేకెత్తిస్తూంటే, సిగ్గు దొంతరలు అలనల్లన ఆమె ముద్దు మోమును రాగరంజితం చేస్తూంటే ఆమె ముఖంలోకే చూస్తూ ఆమె ఒడి స్పర్శలోని సుఖాన్నను భవిస్తూ కొంత సేపు అలాగే వుండిపోయాడు సిద్దార్థ.

ఆ తర్వాత వివేకం వెన్నుతట్టగా చటుక్కున లేచి కూచున్నాడు.

"ఘగహాలేగు పడుకోండి" అన్నదా యువతి తియ్యటి స్వరంతో, హిందీలో.

ఆమె రూపంలాగానే గొంతు కూడా చాలా సమ్మోహనకరంగా వుంది. ఆమెను చూస్తూ, ఆమె మాటలు వింటూ యుగాలు క్షణాల్లా గడిపెయ్యవచ్చుననిపించిందతనికి.

"ఏమిటలా చూస్తున్నావు?" అతనివైపు కొంటెగా చూస్తూ చనువుగా అడిగింది ఆ సుందరి.

"మీరు....మీరెవరు? నే నిక్కడికెలా వచ్చాను?" అన్నాడు సిద్దార్థ. ఆమె ఒడిలోనుంచి లేచి పక్కకు జరుగుతూ.

ఆమె మనోహరంగా నవ్వింది.

"నన్ను 'నువ్వు' అని పిలవొచ్చు లేదా నా పేరుతో పిలు. నేను నిన్ను నువ్వని పిలవటం లేమా....?"

"మీ....నీ పేరేమిటి?"

"ప్రమద్వర."

"గుడ్ నేమ్."

"నాకు ఇంగ్లీ రాదు."

విస్తుపోయి చూశాడామె వంక.

"ఇంగ్లీషు రానిదానివి, నేను వాడిన మాట ఇంగ్లీషు పదమని ఎలా గ్రహించావు?"

ఆమె గుంభనగా నవ్వింది గాని, సమాధానం చెప్పలేదు.

"ఇంతకీ నేనిక్కడికెలా వచ్చి చేరానో, ఇదే ప్రాంతమో, నువ్వెవరో చెప్పనేలేదు."

"అన్నీ ఒకటొకటిగా నీకే తెలుస్తాయి. నువ్వు నా వెంటరా. నిన్ను మా తండ్రిగారికి పరిచయం చేస్తాను."

ఆమె లేచి నిల్చుంది.

అప్పుడు చూశాడు సిద్ధార్థ ఆమెను పరీక్షగా.

ఆమె చాలా ఖరీదైన పట్టువస్త్రాలు ధరించింది. ఆమె చేతులకు, చెవులకు, చేతివేళ్ళకు, నడుముకు మెడకు రకరకాల బంగారు ఆభరణాలు ధగధగ మెరిసిపోతూ ఆమె శరీరాన్ని పచ్చటి కాంతితో ముంచెత్తుతున్నాయి. ఆమె తలమీదుగా పల్చటి మేలిముసుగు ధరించి రాణీవాసం స్త్రీలా కనిపిస్తోంది.

బహుశా ఏ జమీందారు వంశానికో చెందిన స్త్రీ అయివుంటుందనుకున్నాడు సిద్ధార్థ. ఆమె వయసు నిండా పద్దెనిమిదేళ్ళు కూడా వుండదని గ్రహించాడు. అతి గారాబంగా, మురిపెంగా పెరిగిన సుకుమారి అని చూడగానే తెలిసిపోతోంది.

ఆమె ఒక్కో అడుగు అలనల్లన ముందుకు వేస్తుంటే ఆమె పాద మంజీరాలు శ్రావ్యమైన సంగీత ధ్వనులను పలికిస్తున్నాయి. ఆమె సుకుమార పాదాలు నేలను తాకి కందిపోతాయేమోననిపించింది సిద్ధార్థకు.

ప్రముద్వార నాలుగడుగులు వేసి వెనుతిరిగి చిరునవ్వుతో

అతన్ని చూసి, "ఆగిపోయావేం? రా.... నా వెంట నడచి రా!" అన్నది.

అప్పుడే ఈ లోకంలోకి వచ్చినవాడిలా ముందు కడుగువేసి మంత్రముగ్ధుడిలా ఆమె ననుసరించాడు సిద్ధార్థ.

ఎటు చూసినా ప్రకృతి దృశ్యాలు అందంగా కని పిస్తూన్నాయి. కనుచూపు మేర ఎక్కడా ఇసక కనిపించ లేదతనికి.

చాలా అద్భుతమనిపించింది సిద్ధార్థకి.

ఏం జరిగిందో గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇసక తుఫాను రావటం, తను గాల్లోకి లేవటం, ఎటో ఎగిరి పోవటం—అంతవరకే గుర్తుంది!

అంటే గాల్లో ఎంతదూరం అలా ఎగురుతూపోయాడు తను? ఎక్కడికి చేరుకున్నాడు? ఈ ప్రమద్వర ఎవరు? ఈమె ఒళ్ళోకి ఎలా వచ్చిపడ్డాడు?

అంతా వింతగా, నమ్మలేని విషయంలా అనిపించిం దతనికి.

ఆమె ఓ పెద్ద గేటుముందాగింది.

అది మామూలు గేటుకాదని, కోట ముఖద్వారమని, దానికున్న తలుపులు చెక్కవి కాదని గ్రహించాడు సిద్ధార్థ.

అయితే.... ఇది ఏ రాజుల కోట?

చుట్టూ పరికించి చూశాడు.

కోట తలుపులు ఓ బ్రహ్మాండమైన రాతికట్టడంలో ఇమడ్చబడి వున్నాయి.

అప్పటికే కనుచీకటి పడినందువల్ల తను సరిగా గుర్తించలేక పోయాడుగాని రాతితో కట్టబడిన కోట ప్రాకారం అది! మెడ రిక్కించి చూస్తేనేగాని కనిపించ

సంత ఎత్తులో వుంది.

ప్రమద్వర కోట తలుపులమీద టక్ టక్ మంటూ మునివేళ్ళతో శబ్దం చేసింది.

మరుక్షణం పెద్దశబ్దంతో తలుపులు తెరుచుకున్నాయి. శబ్దాన్నిబట్టి అవి యెంత బరువైన తలుపులో అర్థమయ్యింది. అవి ఉక్కు తలుపులు! ఫిరంగి గుళ్ళకు కూడా యేమాత్రం చెక్కు చెదరని బ్రహ్మాండమైన తలుపులవి!

కుచ్చుతలపాగాలతో రాజభటుల్లా వున్న ఇద్దరు కాపలావాళ్ళు ప్రమద్వరని చూసి వంగి సలాం చేశారు.

ప్రమద్వర గర్వంగా తలెగరేసి వాళ్ళ అభివాదాన్నందుకుని హుందాగా ముందుకు అడుగు వేసింది. ఎత్తయిన గడపకు కాలు ఎత్తివేసి దాటవలసి వచ్చింది.

సిద్ధార్థకు అంతా ఇంద్రజాలంలా వుంది.

ఇప్పుడు రాజులు, రాచరికాలు యెక్కడున్నాయి? ఈమె చూడబోతే నిజంగానే రాకుమారిలా వుంది. వాళ్ళు రాజభటుల్లా వున్నారు. ఇది చూడబోతే ఆకాశాన్నంటే గోడలతో, ఉక్కు తలుపులతో కట్టబడిన కోట!

సందేహం లేదు, ఖచ్చితంగా ఇదేదో రాజ్యానికి సంబంధించిన రాచకుటుంబమే!

నోరు తెరిచి ఏదో అడగబోయాడుగాని ఆమె 'ఇష్' అంటూ నోటిదగ్గర వేలుంచి వారించటంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

ముఖద్వారం దాటి పది గజాలు వెళ్ళేసరికి అక్కడ ముద్దులొలికే పూల బాలలు స్వాగతం పలికాయి వారికి. అది సుందర నందనోద్యానవనంలా వుంది. అందులో లేని పూలజాతి లేదు.

అప్పుడే ఉదయించిన చంద్రుడి వెలుగు కిరణాలు

పూల మొక్కలపై ప్రతిఫలించి కనువిందు చేస్తున్నాయి.

ఉద్యానవనంనుంచి దాదాపు వంద గజాల దూరంలో ఆకాశాన్నంటే శిఖరంతో మరో కట్టడం కనిపించింది. చూడటానికి అలనాటి రాజుల భవనంలా వుంది.

సిద్ధార్థ మళ్ళీ ఏదో అడగబోయాడు. కాని ప్రమద్వర అతనికా అవకాశమివ్వలేదు.

అంతులేని ఉత్కంఠ నణచుకుంటూ ఆమె వెంటనంటి నడుస్తున్నాడు సిద్ధార్థ.

ఉద్యానవనంలో తోటమాలిలాంటి ఓ మనిషి ప్రమద్వరని చూసి ఒంగి ఒంగి అభివాదం చేశాడు. ఆమె చిరునవ్వుతో హుందాగా తలెగరేసింది.

సిద్ధార్థ మౌనంగా అంతా చూస్తున్నాడు. అతనిలో ధర్మ సందేహం వచ్చింది.

ఎదురుపడిన వాళ్ళంతా అదేదో మూకీ చిత్రంలోలా నోరు మెదపకుండా అలాగే నిల్చుని వుంటున్నా రెందుకని? ఆమెపట్ల గౌరవంలోనా, లేక వాళ్ళందరు మూగవాళ్ళా? ఏమో...!? ఏ విషయమైనా అడగటాని కామె అవకాశమిస్తే కదా!

వెన్నెల కాంతిలో రాజభవనం బంగారు మలాము పూసినట్టు తళతళ మెరిసిపోతోంది.

వాళ్ళిద్దరు ఆ భవనం సమీపించారు.

భవనం ముందుభాగంలో ఇద్దరు భటుల్లాంటి వ్యక్తులు నిల్చుని వున్నారు. ప్రమద్వరని చూసి వాళ్ళుకూడా సగం ఒంగిపోయి అభివాదం చేశారు.

అయితే ఏ ఒక్కరు కూడా తనవైపు కొత్త వ్యక్తిని చూసినట్టుగాని, లేక తనని గుర్తించినట్టుగాని భావ ప్రకటన చేయకపోవటం అతనికి విస్మయాన్ని కలిగిం

చింది.

ప్రమద్వార భవన ప్రాంగణంలోకి అడుగుపెట్టింది. సిద్ధార్థ ఆమె అడుగులో అడుగువేస్తూ మరబొమ్మలా కదులుతున్నాడు.

లోపల దీపకాంతి అస్పష్టంగా కనిపిస్తోంది. వెలుతురు ఎక్కడినుంచి పడుతున్నదో తెలియదుగాని, డిమ్ లైట్సు వేసున్న ఖరీదైన గదుల్లా హుందాగా, దర్జాగా వున్నాయా గదులు.

గదుల గోడలకి అమూల్యమైన పెయింటింగ్సు సజీవమైన చిత్రణతో తళుకు లీనుతున్నాయి.

అది అంతఃపురం అయివుండొచ్చు ననుకొన్నాడు సిద్ధార్థ. అంతలోనే తను పూర్తిగా అది రాజభవనమనే భ్రమపడుతున్నందుకు తనలో తను నవ్వుకున్నాడు.

ప్రమద్వార అలాంటి నాలుగు గదులు దాటిం తర్వాత అయిందో దాని ముందాగింది.

ఆ గది చాలా అందంగా, ఆకర్షణీయంగా అలంకరించబడివుంది. హంసతూలికా తల్పంలాంటి పట్టుపరుపు, పందిరి మంచం ఓ పక్కగా వున్నాయి.

మత్తెక్కించే పరిమళం ఆ గదినంతా వింత సువాసనలతో ముంచెత్తి వేస్తోంది.

ఇద్దరు పరిచారికలు, అంతదాకా ఆ గది నలంకరిస్తూ వున్న వారల్లా, వాళ్ళు లోపలకు రాగానే ప్రమద్వారకి వంగి నమస్కరించి అక్కడినుంచి బయటకు చకచక వెళ్ళిపోయారు.

"కూచో!" అన్నది ప్రమద్వార నవ్వుతూ. మంత్ర ముగ్ధుడిలా ఆమె చూపిన బెడ్ మీద కూచున్నాడు. ఆమె అతనికి దగ్గరగా, అతన్ని అనుకునేంత సమీపంగా

కూచున్నది.

లేచి నిల్చుండిపోవాలనుకున్న సిద్ధార్థ మళ్ళీ తన ఆలోచన విరమించుకుని అలాగే కూచుండి పోయాడు.

ఎదురుగా నోరూరించే పదార్థాలు వెండిపళ్ళెంలో పెట్టి మేజామీద పెట్టబడున్నాయి. మరో మేజా మీద మరో వెండి పళ్ళెనిండా పండ్లు వున్నాయి.

వాటిని చూస్తూనే సిద్ధార్థ ఆకలి విజృంభించింది. తన విశ్వరూపం చూపించటం మొదలెట్టింది. కడుపునిండా భోంచేసి ఎన్నో సంవత్సరాలయినట్టుంది.

ప్రమద్వర వెండి పళ్ళాలలోని పదార్థాలు కొసరి తినిపించిందతనికి. వద్దు వద్దంటూనే కడుపునిండా తిన్నాడు.

"ఇప్పుడు చెప్పు. నువ్వెవరు? ఈ మహాలు ఎవరివి? నేనీకెలా దొరికాను?" ప్రశ్నలవర్షం కురిపించాడు సిద్ధార్థ.

ప్రమద్వర సమ్మోహనకరంగా నవ్వింది. అతనికళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది. కలవరపడ్డాడు సిద్ధార్థ.

అదే చూపు.... సుస్మిత తనవైపు ఆరాధనగా ఆర్తిగా చూసిన చూపు.... దివ్య తనవైపు ప్రేమగా, అభిమానంగా చూసే చూపు కోయిల తనవైపు అమాయకంగా అనురాగ దృక్కులతో సారించిన చూపు....

అంటే, ప్రమద్వర కూడా తనను ప్రేమిస్తోందా? తనంటే ఇష్టపడుతోందా? తనపట్ల ఆకర్షితురాలయిందా?

తల విదిలించాడు సిద్ధార్థ.

ఏమిటీ ఆకర్షణ? ఈ యువతులందరు తనపట్ల ఆకర్షితులయ్యేంత గొప్పదనమేముంది తనలో? ఎర్రగా పొడవుగా పొడవుకితగ్గ పర్సనాలిటీతో హుందాగా వుండటమేనా?

కాని.... కాని...., ఎంత గొప్ప సుందరీమణుల్ని

చూసినా, అప్సరసలాంటి అమ్మాయిల్ని చూసినా తన మనసు వారిపట్ల అణుమాత్రం కూడా మొగ్గుచూపదు. చలించదు.

తన మనసునిండా పరచుకుని నాసిర సామ్రాజ్యేశ్వరిగా తన హృదయాన్ని కొల్లగొట్టిన దివ్యకు మాత్రమే తన పక్కన చోటుంది.... కాని, సుస్మితతో తను చేసిన పొరపాటు కారణంగా తనకే దివ్య పక్కన నిలబడే అర్హత లేదు!

అవును తనిప్పుడు అపవిత్రుడు. తనకి దివ్య చేయినందుకునే హక్కు లేదు. ఆ అమృతమూర్తిని మోసం చెయ్యలేదు. శీలం ఆడదానికెంత ముఖ్యమో, మగాడికీ అంతే ముఖ్యం!

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నది ప్రమద్వర అతని చేతిమీద మృదువుగా నొక్కి.

అంత సమీపంలో అప్సరసలని ధిక్కరించే అందాన్ని స్వంతం చేసుకున్న రాజకుమారిలాంటి ఆ సుకుమారి తనని స్పృశిస్తుంటే చలించక పోవటానికి అతను మహర్షి కాడు. సాధారణమైన మనిషి.

అందుకే ఆ స్పర్శకతను పులకించాడు. అతనిలోని సున్నిత భావాల్ని ఆ స్పర్శ సుతిమెత్తగా తాకి అతని శరీరాని కంతటికీ విద్యుత్తును ప్రవహింపచేసింది.

ఆమె ఈసారి అతని భుజాల్ని పట్టి కుదిపింది.

"ఏంలేదు.... నా గుడ్డలు బాగా మట్టికొట్టుకుపోయాయి. అక్కడక్కడ చినిగిపోయాయి కూడా. దాదాపు వారం రోజుల్నించి స్నానంలేదు. చాలా చిరాకుగా వుంది." అన్నాడు సిద్ధార్థ పాతం అప్ప చెప్పి

నట్టు.

అయితే అతనిలో చెలరేగుతున్న భావాల్ని ఆమె గుర్తించకపోలేదు. చిన్నగా నవ్వుతున్నది.

"కడుపునిండిన తర్వాతగాని నీ శరీరం శుభ్రంగాలేని విషయం గుర్తురాలేదన్నమాట! క్షణంలో నీ స్నానా ఏర్పాట్లు జరుగుతాయి." అంటూ చప్పట్లు చరిచి ప్రమద్వర.

వెంటనే ఇద్దరు పరిచారికలు ఆ గదిలోకి వచ్చి వినయంగా అభివాదం చేసి నిల్చున్నారు.

"స్నానాలగదిలో పన్నీటి తొట్టెలతో నీరు సిద్ధం చేయండి...." అన్నది ప్రమద్వర.

వాళ్ళు మౌనంగా తలలూపి, వెళ్ళిపోయారు.

సిద్ధార్థకి మళ్ళీ అనుమానం వచ్చింది. నిజంగానే వీళ్ళకు మాటలు రావా? మూగవాళ్ళా?

"పద, వెళ్దాం" అంటూ లేచింది ప్రమద్వర. ఆమె కావాలనే, తను అడిగేందు కవకాశ మివ్వటంలేదని గ్రహించాడు సిద్ధార్థ.

విశాలమైన హాలుగుండా ఓ పాలరాతి గదిలోపలికి తీసుకు వెళ్ళింది ప్రమద్వర.

సిద్ధార్థ ఆ గదిలోని సరంజామాని చూసి ఆశ్చ ర్యంతో స్థాణువులా నిల్చుండిపోయాడు.

విశాలమైన ఆ గదిలో నాలుగు పాలరాతితో చేసిన తొట్టెలనిండా సుగంధాలని విరజిమ్ముతున్న పన్నీరు నింపబడివుంది. ఆ గదిలోనే కాకుండా గోడలు కూడా పాలరాతితో తాపటం చేయబడున్నాయి.

(ఇంకావుంది)